క్లుప్తంగా

వీధి వ్యాపారులు పేర్లు నమోదు చేసుకోవాలి

నెహ్రూనగర్: నగరంలో వీధుల వెంట వ్యాపారులు నగరపాలక సంస్థ గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని స్ట్రీట్ వెండర్స్ టౌన్ వెండింగ్ కమిటీ అధ్యక్షులు సత్తెనపల్లి నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు.

ఎల్‌టీపీలకు శిక్షణ తరగతులు

నెహ్రూనగర్: భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జీఓలపై రీజనల్ డెప్యూటీ డైరెక్టర్ మధు కుమార్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్‌కు(ఎల్‌టీపీ) అవగాహన కల్పించారు. బుధవారం గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన ఎల్‌టీపీలతో నగరంలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో నూతన సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ



గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బజరంగ్ రామకృష్ణను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు బుధవారం తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం 44వ డివిజన్ అధ్యక్షుడిగా, మజ్దూర్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా, పార్టీ జిల్లా కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ గోరక్షా సమైక్య ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ పనిచేశారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా వీరమణీంద్ర
బీజేపీ జిల్లా కార్యదర్శిగా ప్రముఖ న్యాయవాది నారదాసు వీరమణీంద్రను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు బుధవారం ఉత్తర్వులు అందజేశారు. 2014 ఎన్నికల్లో బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. రైల్వే బోర్డు జెడ్ఆర్ యూసీసీ సభ్యుడిగా పనిచేశారు. తన పై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు వీరమణీంద్ర ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై అన్నమయ్య సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం పదో తరగతి నుంచి పీజీ చదివే విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. సుమారు నలభై మంది విద్యార్థులకు ఐదు లక్షల రూపాయలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

నేడు సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: భారత కమ్యూనిస్టు పార్టీ నగర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలోని మల్లయ్యలింగం భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, శ్రమజీవుల విముక్తి కోసం అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని చెప్పారు. గురువారం ఉదయం 9 గంటలకు శారదా కాలనీలోని మామిళ్లపల్లి మాలకొండయ్య స్తూపం వద్ద నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, ఆకిటి అరుణ్ కుమార్, మరియదాసు పాల్గొన్నారు.

పట్టాభిరాం యువతకు స్ఫూర్తి



లక్ష్మీపురం: యువతలో సానుకూల ఆలోచనలు రేకెత్తించటానికి, ప్రేరేపించడానికి, జీవిత సవాళ్లను అధిగమించి ఉన్నతంగా ఎదగటం లాంటి అనేక అంశాలపై తన ప్రసంగాలు, పుస్తకాల ద్వారా స్ఫూర్తినిచ్చిన బీవీ పట్టాభిరాం చిరస్మరణీయుడని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు సేతు రమేష్ అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం బీవీ పట్టాభిరాం సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఇన్సూరెన్స్ అధికారి స్వామి, సంస్థ సీనియర్ సభ్యులు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

శాఖలు సమన్వయంతో పనిచేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: శంకర్ విలాస్ ఆర్ఓబీ పనులు ప్రారంభం దృష్ట్యా ప్రధాన రహదారులను ట్రాఫిక్ రద్దీకి తగిన విధంగా సిద్ధం చేసుకోవాలని, ట్రాఫిక్, రైల్వే, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో జీఎంసీ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్ఓబీ నిర్మాణ పనులు ప్రారంభం కాగా నగరంలో ప్రజల రాకపోకలకు జీఎంసీ వైపు నుంచి పక్కాగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా ప్రత్యామ్నాయ రోడ్లలో ఇరువైపులా ఆక్రమణలు తొలగింపు పూర్తి చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను, రోడ్లకు మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రైల్వే ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ మూడు వంతెనల వద్ద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే సదరు వంతెన ప్రాంతాల్లో జీఎంసీ చేపట్టాల్సిన డ్రెయిన్ల నిర్మాణ పనులు ఉంటే చేపట్టాలని ఈఈని ఆదేశించారు. కంకరగుంట ఆర్‌యూబీ వద్ద వర్షానికి నీరు నిలిచి రాకపోకలు జరగడానికి వీలు ఉండడం లేదని, అక్కడ ప్రస్తుతం ఉన్న మోటార్లకు అదనంగా ఏర్పాటు చేసి, వర్షాకాలం ముగిసే వరకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని కోరారు. రోడ్ల మీద ఆక్రమణలను నగరపాలక సంస్థ తొలగిస్తుందని, వాటిని పునరావృతం కాకుండా పట్టణ ప్రణాళిక సిబ్బందికి ట్రాఫిక్ పోలీస్ సహకరించాలని కోరారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడానికి ప్రత్యామ్నాయంగా నగరంలో ఇంకా ఏమైనా రోడ్ల అభివృద్ధి చేయాలని ట్రాఫిక్ పోలీసులు గుర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ట్రాఫిక్ సీఐలు అశోక్, వీరాస్వామి, ఈఈలు సుందర్రామి రెడ్డి, కోటేశ్వరరావు, ఏసీపీలు రెహ్మాన్, వెంకటేశ్వర రావు, డీఈఈలు నాగభూషణం, కళ్యాణరావు, హనీఫ్ పాల్గొన్నారు.

పీ 4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలి

నెహ్రూనగర్: రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం సీఎం చంద్రబాబు దాతలు, ప్రజలు భాగస్వామ్యం (పీ4) కార్యక్రమాన్ని ప్రారంభించారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రత్యేక అధికారి చల్లా ఓబులేసులతో కలసి నగరంలో హాస్పిటల్స్, విద్యా సంస్థల ప్రతినిధులతో పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్ (పి4)పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వార్డ్ సభల ద్వారా నీడ్ అసెస్మెంట్ సర్వే వార్డ్ సచివాలయాల వారీగా జరుగుతుందని సర్వే అనంతరం మార్గదర్శకులుగా బంగారు కుటుంబాల అవసరాలకు తగిన విధంగా దత్తత తీసుకోవచ్చన్నారు. నగరంలోని హాస్పిటల్స్, విద్యా సంస్థలు తమ సంస్థల వివరాలతో పీ4 వెబ్ సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి అట్టడుగున ఉన్న కుటుంబాల ఆర్థికాభివృద్ధి కోసం అమలు చేస్తున్న పీ 4 కార్యక్రమంలో మార్గదర్శులుగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి కుటుంబానికి విద్యా, వైద్యం అతి ముఖ్యమైన అవసరమని అందువలన వైద్యా, విద్యా సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలకు కేవలం ఆర్థిక సహాయం అందించటమే కాకుండా వారు అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రోత్సహించటం, నైపుణ్యాల శిక్షణను అందించవచ్చన్నారు. సమావేశంలో గుంటూరు ఇన్‌చార్జి ఎంహెచ్ఓలు రామారావు, సోమశేఖర్, ఎస్ఎస్ సాంబయ్య హాస్పిటల్స్, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు భరోసా కరువు

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా



పట్నంబజారు: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు భరోసా లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీలను ఇచ్చిన చంద్రబాబు అమలు చేయలంటే భయంగా ఉందని అనటం, ఇప్పుడు మంత్రి అచ్చెన్నాయుడు ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని తాకట్టు పెట్టాలని అనటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల మంది మహిళలు ఉంటే, కోటి 80 లక్షల మంది మహిళలు అర్హులుగా ఉన్నారని, ఇటువంటి పరిస్థితుల్లో ఆడవారిని హామీలతో మోసం చేశారని పేర్కొన్నారు. తల్లికి వందనం వైఎస్సార్ సీపీ పోరాటం వలనే తల్లుల ఖాతాలో వేశారన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే మహిళలు రోడ్డెక్కే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. జగనన్న అమ్మ ఒడి, ఆసరా, చేయూత వంటి పథకాలతో మహిళలకు అండగా నిలిచాయన్నారు. పీ 4లో మహిళలకు మేలు చేకూరుస్తానని చంద్రబాబు చెప్పటం హాస్యాస్పదంగా ఉందని, ఏ విధంగా వారికి సాయం అందుతుందో చెప్పాల్సిన అవసరం ఉందని కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో అర్జీలు ఇస్తున్నా.. సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చే బాధ్యత నాది అని చెప్పిన పవన్‌కళ్యాణ్ ఇప్పుడు ఎందుకు నోరు మెదపటం లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని నూరిఫాతిమా హెచ్చరించారు.

ఉత్తమ బోధనతో ఆదర్శ అధ్యాపకులుగా ఎదగాలి



విజయ్‌బాబును సత్కరిస్తున్న మధుసూదనరావు, నాగభూషణం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉత్తమ విద్యాబోధనతో ఆదర్శ అధ్యాపకులుగా ఎదగాలని కళాశాల విద్య ఓఎస్డీ డాక్టర్ కోగంటి విజయ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ విభాగ సహకారంతో బ్లూమ్స్ సాంకేతికత సహాయంతో అధ్యాపకుల వృత్తి నైపుణ్యతల అభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల మూల్యాంకన అభివృద్ధికి బ్లూమ్స్ టెక్నాలజీ ఉపయోగించే విధానం, అధ్యాపకుల బోధన విధాన ప్రణాళికకు సహకరించే విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్లూమ్స్ సాంకేతికతతో దిగువ స్థాయి విద్యార్థులను ఎగువ స్థాయి విద్యార్థులుగా తీర్చిదిద్దవచ్చునని అన్నారు. మిల్లర్స్ టాక్సానమీ, వైద్యా విద్యాబోధనలో ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఈసందర్భంగా సదస్సులో పాల్గొన్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం డాక్టర్ విజయ్‌బాబును కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో బుధవారం విశ్వ శాంతిని కాంక్షిస్తూ గణపతి, రుద్ర, చండీ హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో మాసశివరాత్రి సందర్భంగా హోమాలు జరిగాయి. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీని వినియోగించుకోవాలి

తాడేపల్లి రూరల్: డ్రోన్ టెక్నాలజీని వినియోగించుకుని వ్యవసాయ రంగంలో మార్పులకు శ్రీకారం చుట్టాలని టీడీపీ మండల అధ్యక్షులు దాసరి కృష్ణ అన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో రైతుమిత్ర గ్రూప్ సభ్యులు ధనేకుల వేణు, ధనేకుల రామ్ ప్రసాద్‌లకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్‌ను అందజేశారు. కార్యక్రమంలో చిర్రావూరు గ్రామ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ వీరిశెట్టి శ్రీనివాసరావు, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు అంకం కాశీకృష్ణ, ఏఈవోలు రమేష్ బాబు, పావని, డ్రోగో సంస్థ ప్రతినిధులు పృథ్వీరాజ్, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంపై కేసు

ఫిరంగిపురం: మండల పరిధి బేతపూడి గ్రామంలోని హరికార్తికేయ మద్యం దుకాణంలో అధిక రేట్లకు మద్యం విక్రయిస్తున్నారంటూ బుధవారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ జి.యశోద తెలిపారు. సిబ్బందితో తనిఖీలు చేసి బాటిల్‌పై 10 రూపాయలు అధికంగా అమ్ముతున్నారంటూ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు.

అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు

- చంద్రబాబును నమ్మితే నట్టేటా మునిగినట్టే
- బాబు మోసాలను ప్రజలకు ప్రతి కార్యకర్త చేరవేయాలి
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు



వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

గుంటూరు రూరల్: అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని జేకేసీ కళాశాల రోడ్డులో గల వికాస్‌ఇన్ హోటల్‌లో రూరల్ మండలం అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్, ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఎలాగైరనా గద్దెను ఎక్కాలని 600 హామీలను ఇచ్చి ప్రజలను నేడు నట్టేటా ముంచాడన్నారు. చంద్రబాబు తమ సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేసుకునేందుకు పేద ప్రజలను అణగదొక్కుతూనే ఉంటాడన్నారు. పేదల మనిషి జగనన్న మాత్రం చెప్పాడంటే చేస్తాడంతే అన్నారు. ఎన్నికల హామీలను నూరుశాతం అమలు చేసిన ఏకైక నాయకుడు మన జగనన్న మాత్రమేనని తెలిపారు. గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. అబద్ధాలకు పేటెంట్ చంద్రబాబు పొందాడని.. ఎన్నికలు రాగానే ఆయన అబద్ధాలను వందల సంఖ్యలో రాసుకుని ప్రజలపై ప్రయోగించి మోసం చేసి గెలుస్తాడని అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జునయాదవ్ మాట్లాడుతూ.. చంద్రబాబు మోసాలను గ్రామ స్థాయిలో ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉందని గుర్తు చేశారు. నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. చంద్రబాబుని నమ్మితే నట్టేటా మునిగినట్టేనని మరోసారి రుజువైందని తెలిపారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు, రాష్ట్ర నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు మోదుగుల, బలసాని తదితరులు

ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలి

గుంటూరు రూరల్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు తగిన డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేసుకుని.. నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని, లేకుంటే మార్టిగేజ్ మంజూరు చేయమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం ఆయన గోరంట్ల, గాయత్రీ నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సి సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, డ్రైనేజీ కనెక్షన్ లేని వాటికి మార్టిగేజ్ మంజూరు నిలిపివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాల నిర్మాణాలు జరగాలని అన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. అనంతరం చౌడవరంలోని సీఆర్ కాలనీలో పర్యటించి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

నిర్మానుష్య ప్రాంతంలో బైక్ చక్రాలు తొలగింపు



పెదకాకాని: చాకచక్యంగా బైక్‌లు కాజేస్తున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతుంది. పెదకాకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలువురి బైక్‌లు మాయం అవుతున్నప్పటికీ కొన్ని మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. పెదకాకాని రైల్వేహాల్ట్ సమీపంలో ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో కొత్త ద్విచక్ర వాహనం నిలిపి ఉంది. ఆ బైక్‌కు రెండు చక్రాలు, బ్యాటరీ, పలు స్పేర్ స్పాట్‌లు తొలగించి ఉన్నాయి. ఈ బైక్‌ను అనకాపల్లి ప్రాంతం నుంచి దొంగిలించి పెదకాకాని ఏరియాకు తీసుకు వచ్చి ముళ్ల పొదల్లో వదిలేశారని.. బైక్‌లోని విలువైన సామాన్లను తొలగించి తీసుకు వెళ్లి ఉంటారని సమాచారం. అలానే నెల రోజుల క్రితం పెదకాకాని రైల్వేహాల్ట్ వద్ద పెట్టి వెళ్లిన బైక్ ఇప్పటికీ అలానే ఉంది. నాలుగు నెలల కిందట వెనిగండ్ల, అగతవరప్పాడు గ్రామాల మధ్య నిర్మానుష ప్రదేశంలో మరో బైక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు.

ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోరాదు

డీఎస్పీ అరవింద్



మాట్లాడుతున్న డీఎస్పీ అరవింద్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో ర్యాగింగ్‌కు పాల్పడి భావి జీవితాన్ని నాశనం చేసుకోరాదని గుంటూరు వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ర్యాగింగ్, సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ అరవింద్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ భూతం జోలికి వెళ్లి అందమైన జీవితాలని అంధకారం చేసుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకుని తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని, చక్కగా చదువుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తున్నారని, తద్వారా సైబర్ నేరగాళ్లు వీరిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. సైబర్ క్రైంపై అవగాహన కలిగి ఉండటం వలన మోసగాళ్ల చేతికి చిక్కకుండా, నష్టపోకుండా ఉంటుందని చెప్పారు. అపరిచిత వ్యక్తులు పంపే మెసేజ్‌లకు స్పందించరాదని, ఫోన్లకు వచ్చే వెబ్‌సైట్ లింక్‌లు, డబ్బు ఆశ చూపించే లాటరీ వంటి మెసేజ్‌లు, సమాచారాన్ని నిజమని నమ్మి మోసపోరాదని హెచ్చరించారు. సదస్సులో సీఐ జి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ రామాంజనేయులు, డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితా దేవి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, కళాశాల యాంటీ ర్యాగింగ్ కన్వీనర్ మేజర్ పి.కుమార్‌రాజా, సభ్యులు సీహెచ్ రాంబాబు, డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, ఇంటర్మీడియెట్ ఇన్‌చార్జి జి.సురేష్ కుమార్, వ్యాయామ అధ్యాపకుడు వాసుదేవరరావు పాల్గొన్నారు.

రేపు కవికోకిల గుర్రం జాషువా సాహిత్య సభ



నూతన కార్యవర్గం

నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఈనెల 25న కవి కోకిల గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా సాహిత్య సభ నిర్వహించనున్నట్లు కళా స్రవంతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ తెలిపారు. రాజేంద్ర నగర్ రెండో వీధిలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రభుదాస్ మాట్లాడుతూ సంస్థ రిజిస్టర్ అయిన సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారితో నూతన కార్యవర్గాలను ఎన్నుకుంటున్నట్లు వివరించారు. సంస్థ అధ్యక్షులుగా డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, ఉపాధ్యక్షులుగా ఎర్రమనేని రంగారావు, ప్రధాన కార్యదర్శిగా తాళ్ళూరి వెంకటరత్నారావు, కార్యదర్శిగా సూరం సాంబశివరావు, కోశాధికారి పుట్టగంటి నరసింహారావు, కార్యవర్గ సభ్యులుగా రాణీ ప్రమీల, కొమ్మతోటి కేజీయా సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో నూతన కార్యవర్గం, పల్నాటి సుబ్బారావు, వాసా మాణిక్యాలరావు పాల్గొన్నారు.


ఆర్కాలో బ్రాకీథెరపీ యూనిట్ ప్రారంభం



బ్రాకీ థెరపీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: క్యాన్సర్ రోగులకు మెరుగైన చికిత్సలు అందించేందుకు అత్యాధునిక వైద్య పరికరాలను ఆర్కా హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అందుబాటులోకి తీసుకురావటం చాలా అభినందనీయమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. బుధవారం గుంటూరు కాకాని రోడ్ ఆటోనగర్‌లోని ఆర్కా క్యాన్సర్ హాస్పిటల్‌లో ఎలెక్టా ఫ్లెక్సీట్రాన్ బ్రాకీ థెరపీ యూనిట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ క్యాన్సర్‌తో బాధపడుతున్న పట్టణ, పల్లె ప్రజలకు ఈ అధునిక వైద్య పరికరంతో చికిత్సలు అందించటం ద్వారా రోగులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. బాధితుల జీవితాల్లో గుణాత్మక మార్పును బ్రాకీథెరపీ తీసుకొస్తుందని తెలిపారు. హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ పవన్ రాఘవరెడ్డి, డాక్టర్ హేమంత్ మాకినేని, రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ దేవనబోయిన శౌరిరాజునాయుడు మాట్లాడుతూ ప్రపంచస్థాయి అగ్రగామిగా నిలిచిన బ్రాకీథెరపీ సాంకేతికతను తమ ఆస్పత్రిలో రోగుల ప్రయోజనార్థం అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.హిమని, డాక్టర్ మద్ది శరత్‌కుమార్ పాల్గొన్నారు.

అంధకారంలో ఆర్టీసీ కాలనీ



నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో వీధిలైట్ల నిర్వహణ ఇంజినీరింగ్ అధికారులు పూర్తిగా విస్మరించారు. నగరంలో పలు ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగకపోయినప్పటికీ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. శివారు ప్రాంతాల్లో వీధి లైట్లు లేకపోవడంతో ఆకతాయిల తాడికి ఎక్కువగా ఉన్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి లైట్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

విద్యతో పాటు కళల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పీఆర్కే ప్రసాద్

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పర్ఫామెన్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ నందలి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్ఫామెన్స్ థియేటర్‌లో బుధవారం విద్యార్థి కళాకారులకు ఆర్ట్ ఎప్రిసియేషన్, స్టడీ ఆఫ్ బ్యూటీ అన్న అంశంపై ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సంగీత నృత్య నాటక కళలకు సంబంధించిన విద్యార్థి కళాకారులందరూ భాగస్వామ్యం పొందారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పీఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ.. కళ, వాటి ఉపయోగం, విలువలు, వివిధ రకాలైనటువంటి లక్షణాల గురించి వివరించారు. రంగస్థలం మాట్లాడుతూ.. పాత్ర లోతులను అంచనా వేసుకుని పాత్రలతో మాట్లాడడం, పాత్రులు ఆశించిన విధంగా ఆ సౌందర్య వివరాలను ఆకలింపు చేసుకుని పాత్ర పోషించడంలో సౌందర్య కళ చాలా ముఖ్యమైందన్నారు. ఈ సమావేశానికి సంగీత కళల శాఖ అధిపతి డాక్టర్ మంజుల, మత్స్యశాఖ అధ్యాపకులు కాశయ్య, విశ్వనాథ్‌లు పాల్గొని విద్యార్థి కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించారు.

ఉదిత్ ప్రధాన్‌ను వెంటనే శిక్షించాలి

పెదకాకాని(ఏఎన్‌యూ): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఒరిస్సా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్‌ప్రధాన్ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ ఏబీవీపీ ఉపాధ్యక్షుడు హేమంత్‌రామ్ మాట్లాడుతూ.. ఒరిస్సాలో 19 ఏళ్ల యువతిపై అత్యాచారం చేసిన ఎన్ఎస్‌యూఐ ఒరిస్సా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్‌ను వెంటనే శిక్షించాలని కోరారు. ఎన్ఎస్‌యూని దేశమంతటా బ్యాన్ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యూఐ పేరుతో విద్యార్థులపై దాడులు చేయాలని నేర్పిస్తుందా అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు.

క్లుప్తంగా

రోల్‌బాల్ చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోల్ బాల్ అసోసియేషన్ ఇటీవల నిర్వహించిన 7వ రాష్ట్ర సబ్ జూనియర్ రోల్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారతీయ విద్యాభవన్ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల ప్రధాన కార్యదర్శి పి.రామచంద్రరాజు తెలిపారు. శనివారం కలెక్టర్‌బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. రామచంద్రరాజు మాట్లాడుతూ 5వ తరగతి విద్యార్థిని కె.కై వల్యశ్రీ, 7వ తరగతి విద్యార్థి వై.జనీష్ విశ్వసాయి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి బహుమతులు గెలుపొందినట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కోశాధికారి కె.రామ్ సుభాష్, ప్రిన్సిపాల్ హేమాంబ, హెచ్‌ఎం కృష్ణ ఉషశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

జీజీహెచ్ రేడియో గ్రాఫర్స్‌కు యూనిఫాం అందజేత



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఎంప్లాయిస్ తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. శనివారం రేడియాలజీ విభాగంలో రేడియోగ్రాఫర్స్‌కు యూనిఫాంను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిర్దేశిత యూనిఫాం ధరించి విధులకు హాజరు అవ్వాలని, ఐడీ కార్డ్ తప్పనిసరిగా వేసుకోవాలని కోరారు. ఎన్టీఆర్ వైద్య సేవలో పని చేస్తున్న ఉద్యోగులు, ఆస్పత్రిలో ఉన్న ల్యాబ్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్ తదితర విభాగాల ఉద్యోగులందరికీ యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ సాంబశివరావు, రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ విజేత పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు చేయూత



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని బంగారు కుటుంబాలను మార్గదర్శకుల ద్వారా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. పీ 4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్నర్‌షిప్)పై శనివారం కాంట్రాక్టర్లతో నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహమ్మద్ నసీర్ హాజరయ్యారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో 75 వేల పేద కుటుంబాలు ఉంటే వాటిలో 25 వేల పేద కుటుంబాలు, తూర్పు నియోజకవర్గంలోనే ఉన్నాయని చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న మొదటి పది శాతం మంది(మార్గదర్శులు) అట్టడుగున ఉన్న 20 శాతం(బంగారు) కుటుంబాలను దత్తత తీసుకొని సహకారం అందించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.

కార్గిల్ అమర వీరులకు ఘన నివాళి



గుంటూరు మెడికల్: మన సైనికుల వీరోచిత పోరాటంతో విజయం సాధించిన జూలై 26ను మనందరం కార్గిల్ విజయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. గుంటూరు హిందూ కాలేజ్ సెంటర్ వద్ద ఉన్న అమర జవానుల స్మారక చిహ్నం వద్ద శనివారం చెరుకూరి తిరపతిరావు జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ గుణశీల ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీస్ సూపరింటెండెంట్ ఆనందరావు, క్యాంటీన్ మేనేజర్ శంకరయ్య, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, మాజీ సైనికుడు తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ సైనిక అమరు త్యాగాలను స్మరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసరావు, బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, ఈదర శ్రీనివాసరెడ్డి, కుమార్ గౌడ్, సురేష్, సాధు రామకృష్ణ, జితేంద్ర గుప్తా, సురేష్ జైన్, ఖుద్దూస్, రఫీ, తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షోభ హాస్టళ్లు..

- మౌలిక వసతులు కరువు
- దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు ఇంత వరకు లేవు
- నోట్‌బుక్స్ ఊసేలేదు..
- అధ్వానంగా మరుగుదొడ్లు



నందివెలుగు రోడ్డులోని ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు



ముద్ద లాగా ఉన్న అన్నం



నీళ్ల సాంబారు

నెహ్రూనగర్: సంక్షేమం.. సంక్షోభంలోకి నెట్టారు.. కనీస వసతులు లేవు. ఉన్నా అధ్వానంగా మారాయి. అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. మరుగుదొడ్లకు తలుపు లేవు.. ఉంటే నీళ్లు లేవు.. ఇలాంటి సమస్యలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు సతమతమవుతున్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది.

ఎస్సీ హాస్టల్స్ వార్డెన్లు అప్పులపాలు..

డైట్ చార్జీలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెంచింది. అయితే డైట్ చార్జీలను సకాలంలో అందించడం కూటమి ప్రభుత్వం విఫలమైంది. ము ఖ్యంగా ఎస్సీ హాస్టల్స్‌పై ప్రభుత్వం మరింత చిన్నచూపు చూపుతోంది. తోటి బీసీ, ఎస్టీ హాస్టల్స్‌కు ఇచ్చిన ప్రాధాన్యం ఎస్సీ హాస్టల్స్ నిర్వహణలో వ్య త్యాసం చూపుతుంది. ముఖ్యంగా గుంటూరు నగరంలోని ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్స్‌కు గత సంవత్సరం జూన్ నుంచి డైట్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో హాస్టల్ వార్డెన్లు అప్పులు తీసుకువచ్చి విద్యార్థులకు వండించాల్సిన పరిస్థితి నెలకొంది.

వర్షాకాలంలోనూ దుప్పట్లు రాలేదు..

నగరంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్‌కు పాఠశాలలు, కాలేజీలు తెరిచి నెల రోజులు దాటినప్పటికి ఇంత వరకు విద్యార్థులకు ఇవ్వాల్సిన కార్పెట్లు, దుప్పట్లు, గ్లాసులు, ప్లేట్లు ఇవ్వలేదు. దీంతో పాటు కాస్మోటిక్ చార్జీలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నా ఇంత వరకు విద్యార్థులకు చెల్లింపులు చేయకపోవడంతో సబ్బులు, షాంపులు, పేస్ట్ ఇతర నిత్యావసరాలు కొనలేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని హాస్టల్స్‌లో టాయిలెట్స్ డోర్లు ఊడిపోయినా వాటికి మరమ్మతులు చేయించని పరిస్థితులు ఉన్నాయి. అన్ని సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం కూడా అందించని స్థితిలో పాలకులు ఉన్నారు. నీళ్ల సాంబారు, సంగటి లాగా ఉన్న రైస్ తినలేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని హాస్టల్స్‌లో అయితే మెను ప్రకారం డైట్ పెట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పిల్లలు సమస్యల పట్టించుకోని వార్డెన్లు



ఎస్‌వీఎస్ కాలనీలోని ఎస్సీ హాస్టల్‌లో బాత్‌రూం దుస్థితి

నగరంలోని పలు హాస్టల్స్‌లో విద్యార్థులకు అవసరమైనవి అందించడంలో, వారి సమస్యలను వినే పరిస్థితుల్లో లేరని విద్యార్థులు చెబుతున్నారు. సకాలంలో వార్డెన్లు అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నందివెలుగు రోడ్డులోని ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్‌లో ఫ్యాన్లు పాడైపోయిన దానిని రిపేరు చేయాలని అడిగినప్పటికి మీరే చేయించుకోవాలని వార్డెన్ చెప్పడంతో చేసేదేమి లేక విద్యార్థులే ఫ్యాన్లు రిపేర్లు చేయించుకున్న పరిస్థితి. హాస్టల్ విజిట్‌కు ఎవరైన పై అధికారులు వచ్చినప్పుడు ఫిర్యాదు చేస్తే..వాటిని కూడా పట్టించుకునే పరిస్థితి లేదని విద్యార్థులు వాపోతున్నారు.

రోడ్లు, డ్రైయిన్లపై ఆక్రమణలు తొలగించాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రోడ్ల వెంబడి, మేజర్ డ్రెయిన్లపైన ఆక్రమణలు ఉండడానికి వీలులేదని, పట్టణ ప్రణాళికాధికారులు ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం బస్టాండ్ రోడ్, నందివెలుగు రోడ్లను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ వంతెన పనులు ప్రారంభం అయినందున నగరంలో ట్రాఫిక్ సమస్యలు వచ్చే అవకాశం ఉందని, రోడ్ ఆక్రమణలను ఉపేక్షించబోమన్నారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈలు నాగభూషణం, హనీఫ్, ఎంహెచ్‌ఓ (ఇన్‌చార్జి) రామారావు, కార్పొరేటర్ మహమూద్ పాల్గొన్నారు.

పీవీ రమణకు సువర్ణ కంకణధారణ, గద్దర్ అవార్డు

నగరంపాలెం: ప్రజా వాగ్గేయకారుడు పీవీ రమణకు సువర్ణ కంకణధారణ, గద్దర్ అవార్డు ప్రదానం చేయనున్నట్లు సంస్కృతి(సంగీత, సాహిత్య, నృత్యం, నాటక సంస్థ) వ్యవస్థాపకులు సర్రాజు బాలచందర్, అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ పీవీ మల్లికార్జునరావు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆగస్టు మూడో తేదీన బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని కొరటాల సమావేశ మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, బూర్ల రామాంజనేయులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రజాకవి పైడి జయరాజ్ హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు పీఆర్ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, ఇంజినీరింగ్ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంఘం గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు సంపత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సంఘ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు హాజరు కానున్నట్లు చెప్పారు.

స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ బలోపేతానికి కృషి

సంఘం రాష్ట్ర కార్యదర్శి అయ్యప్ప రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అయ్యప్పరెడ్డి

లక్ష్మీపురం: స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌ను బలోపేతం ద్వారానే ఆర్టీసీని రక్షించుకోగలమని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్ప రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల శనివారం రెండో రోజు ముగిశాయి. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలు కారణంగా ఆర్టీసీకి పెను ప్రమాదం ముంచుకొస్తుందన్నారు. ఈ ప్రమాదాన్ని మొత్తం ఆర్టీసీ కార్మికులకు తెలియజేప్పి కార్మికులను ఐక్య ఉద్యమాలకు సిద్ధం చేయాల్సిన బాధ్యత ఫెడరేషన్ కార్యకర్తలదే అన్నారు. ఆర్టీసీలో కండక్టర్ నియామకాలు చేపట్టరాదని, కొత్త బస్సులు కొనుగోలు చేయరాదని, ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పాలని, 2029 నాటికి ఆర్టీసీలో అన్ని విద్యుత్ బస్సులే ఉండాలని ప్రభుత్వాలు చూస్తున్నాయని ఆరోపించారు. విద్యుత్ బస్సులన్నీ ప్రైవేటు సంస్థల ద్వారానే తీసుకోవాలని చెప్పడం దారుణమని చెప్పారు. ఈ విధానాలను నిలవరించేందుకు ఆర్టీసీ కార్మికులంతా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బాబూ ప్రసాద్, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య, ఎల్ఐసీ ఉద్యోగ సంఘ నాయకులు వీకే సురేష్, ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిప్రసాద్, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టీవీజీ రవిశంకర్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుల బాధ్యతల స్వీకరణ



కార్యవర్గ సభ్యులతో బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు జిల్లా నూతన జిల్లా పదాధికారులు జిల్లా కార్యవర్గ సభ్యుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పలపాటి శ్రీనివాసరాజు, చిగురుపాటి కుమారస్వామి పాల్గొన్నారు. నూతనంగా నియమితులైన జిల్లా పదాధికారులకు నియామక పత్రాలు అందచేసి శాలువాతో సత్కరించారు. వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లాలో పార్టీ నిర్మాణం సంస్థాగత నిర్మాణంపై అందరూ కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు కనీస అవసరాలు రేషన్ బియ్యం, వృద్ధాప్య, వితంతు పింఛన్, మంచినీరు, మురుగు కాల్వలు వాటి మీద దృష్టి పెట్టి అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జూపూడి రంగరాజు, మకుటం శివ, తమనంపూడి రామకృష్ణారెడ్డి, శనక్కాయల అరుణ, యడ్లపాటి స్వరూపరాణి, ఈదర శ్రీనివాసరెడ్డి, గాజుల వెంకయ్య నాయుడు, నేరెళ్ల మాధవరావు, భీమినేని చంద్రశేఖర్, కొక్కెర శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేటలోని నాగార్జున సాంస్కృతిక కేంద్రం, నాగార్జున సంగీత కళాశాల ఆవరణలో శనివారం రాగమయూరి ఎస్పీ, హాసిని ఎస్పీ గాత్ర కచేరీ నిర్వహించారు. మృదంగంపై కె.వి.రామకృష్ణ (తెనాలి), వయొలిన్‌పై చావలి శ్రీనివాస్(విజయవాడ) చక్కని వాయిద్యాన్ని అందించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్ కె.జి.శంకర్ హాజరై కళాకారులను సత్కరించారు. నాగార్జున స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాగార్జున సాంస్కృతిక కేంద్రం, సంగీత కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణ, కార్యదర్శి పీఎస్ఏన్‌మూర్తి, డాక్టర్ ఎం.ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

గర్భిణులకు పోష్టికాహార కిట్లు పంపిణీ

నగరంపాలెం: జన్మించే పిల్లలు చక్కని బరువుతో ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు ఆహార నియమాలు పాటించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రసూన అన్నారు. రోటరీ క్లబ్ గుంటూరు ఆధ్వర్యంలో మాతా శిశు సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణలో భాగంగా శారదాకాలనీ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గర్భిణులకు పౌష్టిక ఆహార కిట్లు, పండ్లు పంపిణీ చేశారు. బ్లాసమ్స్ తల్లి పిల్లల వైద్యశాలలో తల్లి పిల్లలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని పత్రాలను ప్రముఖ పిల్లల వైద్యులు మేకల నాగసుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు నంబూరు కృష్ణమూర్తి, కె.శ్రీధర్ బాబు నిర్వహించగా, రోటరీ సేవా విభాగ బాధ్యులు కొల్లి అరవింద్, శోభానంద్, పోలిశెట్టి ప్రేమ్‌కుమార్, పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ రఘురామ్ పాల్గొన్నారు.

సీజీహెచ్‌ఎస్‌కు నర్సింగ్ ఆఫీసర్ నియామకం



హేమ సుందరిని సత్కరిస్తున్న సీతారామయ్య చౌదరి, సామ్రాజ్యం

గుంటూరు మెడికల్: గుంటూరు సీజీహెచ్‌ఎస్ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా బి.హేమాసుందరి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్(సీజీహెచ్‌ఎస్) గుంటూరు వెల్నెస్ సెంటర్ ఏర్పడి ఏడు సంవత్సరాలు దాటినా, అక్కడ నర్సింగ్ ఆఫీసర్ నియామకం లేదని సీజీహెచ్‌ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు గుమ్మడి సీతారామయ్య చౌదరి, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి విన్నవించారు. స్పందించిన ఆయన కేంద్ర ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సీతారామయ్యచౌదరి, సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్స్ అసోసియేషన్ గుంటూరు సర్కిల్ సెక్రటరీ కె.సామ్రాజ్యంలు నర్సింగ్ అధికారిణి హేమా సుందరిని పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. హేమ సుందరి మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య పరిరక్షణకు శక్తి వంచన లేకుండా వైద్య సంరక్షణ సేవలు అందిస్తానన్నారు. రోగుల చికిత్సలో డాక్టర్లకు తోడ్పాటు, రోగుల పర్యవేక్షణ, మందుల పంపిణీ, ఆరోగ్య సంరక్షణ ప్రణాళికలు అమ లుకు సహాయపడటం వంటి సేవలను విస్తృత శ్రేణి నైపుణ్యంతో అందిస్తామన్నారు. తొలుత హేమా సుందరి, సీజీహెచ్‌ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సి హెచ్. కోటేశ్వరరావు, ఎస్.ఎం.ఓ డాక్టర్ విద్యను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కుట్రలో భాగమే స్మార్ట్ మీటర్ల బిగింపు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి



మాట్లాడుతున్న రమాదేవి

లక్ష్మీపురం: విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే కుట్రలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తోందని, ఆ ప్రయత్నాన్ని విరమించుకోకుంటే ఆందోళనకు దిగుతామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి అన్నారు. గుంటూరు బ్రాడిపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి నేతలు ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టమని లోకేష్ పాదయాత్రలో చెప్పారని, నేడు స్మార్ట్ మీటర్లు బిగించడం ఏంటని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తగా వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. పార్టీ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు సి.హెచ్. బాబురావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి చట్టబద్ధత కల్పించాలని పేర్కొన్నారు. 29 గ్రామాలలోని రాజధానిని అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి చేయాలని తెలిపారు. ప్రజలకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ జిల్లాలో నల్లబర్లీ పొగాకును కేంద్రాలు పెంచి మొత్తం కొనుగోలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, కె.నళినీకాంత్, ఎం.రవి, బూరుగ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు డి.శ్రీనివాసకుమారి, ఎల్.అరుణ, వి.జవహర్ లాల్, కె.అజయ్‌కుమార్, డి.లక్ష్మీనారాయణ, ఎం.ఎ. చిష్టీ, యు.దుర్గారావు పాల్గొన్నారు.

పాటిస్తే జాగ్రత్త.. ప్రాణాలకు రక్ష

- స్క్రీనింగ్ పరీక్షలతో గుర్తించే అవకాశం
- హెపటైటిస్ సోకకుండాఅందుబాటులో వ్యాక్సిన్
- 28న వరల్డ్ హెపటైటిస్ డే

ప్రపంచ ఆరోగ్య సంస్థ 2022 నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా హెపటైటిస్–బి, హెపటైటిస్–సి వ్యాధితో 304 మిలియన్ల మంది బాధపడుతున్నారు. బాధితులలో 90 శాతం మందికి ఈ వ్యాధి పైన, వైద్య చికిత్సపైన అవగాహన లేదు. దీంతో వరల్డ్ హెల్త్ అసెంబ్లీ 2010 జూలై 28న హెపటైటిస్ దేను నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా 'సాక్షి ' అందిస్తున్న ప్రత్యేక కథనం.



గుంటూరు మెడికల్: హెపటైటీస్ అనేది కాలేయానికి సంబంధించిన వ్యాధి. ఇది వైరస్ ద్వారా సోకుతుంది. శరీరంలోకి వైరస్ ఒకసారి వస్తే క్రమేపి వటి సంఖ్య లక్షల్లో పెరిగిపోయి లివర్‌ను దెబ్బతీస్తాయి. వ్యాధిలో ఏ, బీ, సీ, డీ , ఈ అనే రకాలు ఉన్నా వాటిలో బీ, సీ రకాలు ప్రాణాంతకం. గుంటూరు జీజీహెచ్‌లో 2021 నుంచి ప్రత్యేకంగా హెపటైటీస్ స్క్రీనింగ్ సెంటర్ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిసుస్తున్నారు. 2021 నుంచి ఈ ఏడాది జూన్ వరకు 35,859 మందికి హెపటైటిస్ బీ అనుమానంతో పరీక్షలు చేయగా 1746 మందికి నిర్ధారణ అయింది. ప్రస్తుతం 737 మంది జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. హెపటైటిస్ సీ స్క్రీనింగ్ పరీక్షలు 25,053 మందికి చేయగా, 803 మందికి ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం 596 మంది బాధితులు చికిత్స పొందుతున్నారు. హెపటైటీస్ – సి బాధితులకు నెల నెలా మందులు ఉచితంగా అందిస్తున్నారు. వీరు కొన్ని నెలలు వాడితే సరిపోతుంది. హెపటైటిస్–బి బాధితులు జీవితాంతం మందులు వాడాల్సి ఉంటుంది. వ్యాక్సిన్లు, వైద్యసేవలు కూడా పూర్తి ఉచితంగా అందిస్తున్నారు.

వ్యాధి సోకే విధానం, లక్షణాలు...

ఇన్‌ఫెక్ట్ అయిన రక్తపు ఉత్పత్తుల ద్వారా, శరీరంలో ఊరే వివిధ ద్రవాల ద్వారా (వీర్యం, యోని స్రవాలు, మూత్రం) సురక్షితం కాని సంభోగం ద్వారా, అనేక మందితో సంభోగం చేయటం ద్వారా , ఒకరికి వాడిన ఇంజెక్షన్ సూదిని వేరొకరికి వాడటం ద్వారా, టాటూలు వేసుకోవటం, ముక్కు, చెవులు కుట్టుకోవటం, ఒక రేజర్ బ్లేడ్‌ను అనేక మంది వాడటం, ఒకరు వాడిన టూత్ బ్రష్‌ను మరొకరు వాడటం, అసురక్షితమైన రక్తదానం ద్వారా, వైరస్ కలిగిన గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు హెపటైటిస్–బీ, సీ వ్యాధులొస్తాయి. కాలేయం వాచిపోయి మూత్రం పసుపుపచ్చగా వస్తుంది. కళ్లు, శరీరం, నాలుక తదితర భాగాలన్నీ పసుపు పచ్చగా మారిపోతాయి. దీనినే పచ్చకామెర్లు అంటారు. వ్యాధి ప్రారంభ దశలో తేలికపాటి జ్వరం, ఆకలి మందగించటం, వాంతులవ్వటం, వ్యక్తి బాగా బలహీనపడటం, కీళ్లనొప్పులు ఉంటాయి. కొంత మంది పరిస్థితి ఇంకా భయంకరంగా ఉంటుంది. కాలేయం సరిగా పనిచేయక మృత్యువుకు దారితీస్తుంది. హెపటైటీస్– బి సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్ చేయించుకోవాలి.

లివర్ క్యాన్సర్‌కు దారితీస్తోంది



లివర్ క్యాన్సర్లు రావటానికి హెపటైటిస్– బీ, సీ వ్యాధులే కారణం. కామెర్ల వ్యాధి సోకిన వారు తప్పనిసరిగా నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి. శరీరంలో హెపటైటిస్ ఆరు నెలల కంటే ఎక్కువ కాలం ఉంటే క్రానిక్ హెపటైటిస్‌కు దారితీసి కొన్నేళ్ల తరువాత లివర్ దెబ్బతినటానికి కారణమవుతుంది. దీని వల్ల లివర్ క్యాన్సర్, లివర్ ఫెయిల్యూర్, లివర్ సిరోసిస్ వస్తుంది.

– డాక్టర్ భైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్యనిపుణులు, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచితంగా వైద్యం



గుంటూరు జీజీహెచ్‌లో వ్యాధి బాధితులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలను అందిస్తున్నాం. స్క్రీనింగ్ కార్యక్రమాన్ని 2020 నవంబరులో ప్రారంభించాం. రోజూ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ విభాగంలో ఉచితంగా పరీక్షలు చేస్తున్నాం. నిర్ధారణ అయిన వారికి నెలకు సుమారు రూ. 20 వేలు ఖరీదు చేసే మందులు సైతం ఉచితంగా అందిస్తున్నాం. హై రిస్క్ గ్రూపుకు చెందిన ప్రతి ఒక్కరూ ముందస్తుగా వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు.

– డాక్టర్ నాగూర్‌బాషా, అసోసియేట్ ప్రొఫెసర్, గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్య విభాగం, జీజీహెచ్

నేత్ర లోపాల నివారణపై రోటరీ క్లబ్ దృష్టి



విద్యార్థినికి కంటి పరీక్షలు

నగరంపాలెం: సృష్టిని వీక్షించే నేత్రాల రక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు మన్నె అనూరాధ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ ఆధ్వర్యంలో సుదర్శిని కంటి ఆసుపత్రి సహకారంతో శనివారం ఎస్‌వీఎస్‌కాలనీ చిన్మయ విద్యాలయ ప్రాంగణంలో విద్యార్థులకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆధునాతనమైన కంటి వైద్య పరికరాల ద్వారా పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేశారు. క్లబ్ ఆదర్శ్ కార్యదర్శి నందిపాటి వాణీకుమారి మాట్లాడారు. రోటరీ క్లబ్ ఆదర్శ్ ద్వారా ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయించేందుకు సిద్ధమని సుదర్శిని కంటి ఆసుపత్రి డైరెక్టర్, రోటేరియన్ డాక్టర్ దుర్గా చైతన్య తెలిపారు. శిబిరంలో రొటేరియన్ అశోక, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు మెడికల్: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ ఆధ్వర్యంలో గుంటూరు జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగంలో గర్భిణులకు పౌష్టిక ఆహారం ప్యాకెట్లను శనివారం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ప్రెసిడెంట్ మన్నే అనురాధ, సెక్రటరీ వాణికుమారి నందిపేట, పాస్ట్ ప్రెసిడెంట్‌లు అశోక బొద్దపాటి, జై శ్రీ గరికపాటి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, ప్రసూతి విభాగ వైద్యులు సమక్షంలో మొత్తం 50 కిట్లు పంపిణీ చేశారు.